నేడు భవిష్యనిధి అదాలత్

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) కార్యాలయ ఆధ్వర్యంలో ఈ నెల 10న (నేడు) భవిష్యనిధి అదాలత్ నిర్వహించనున్నట్లు పీఎఫ్ కమిషనర్ వెంకటేశ్వర్లు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని ఆర్టీసీ బస్ టెర్మినల్‌లోని రెండో అంతస్తులోని పీఎఫ్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉంటారని, ఖాతాదారుల సమస్యలు పరిష్కరించడమే కాకుండా సలహాలు, సూచనలు స్వీకరిస్తామని తెలిపారు. కూకట్‌పల్లి, జీడిమెట్ల, సనత్‌నగర్, బీహెచ్ఈఎల్ తదితర ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

14న ఎస్పీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు



అధ్యక్ష పదవికి నామినేషన్ దాఖలు చేస్తున్న బాబ్జీ

మూసాపేట: ఫతేనగర్ డివిజన్ ఎస్పీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు 14న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి పి. రఘుపతి రెడ్డి తెలిపారు. శుక్రవారం నామినేషన్ దాఖలకు చివరి తేదీ అని, ఇప్పటికే అధ్యక్ష పదవికి హరినాథ్ బాబ్జీ, సెక్రటరీగా ఏ. రవి నామినేషన్లు దాఖలు చేశారని పేర్కొన్నారు. 12న నామినేషన్ల ఉపసంహరణ, 14న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఓటింగ్, సాయంత్రం 3 గంటల నుంచి కౌంటింగ్ ఉంటుందని తెలిపారు. సుమారు 215 ఓట్లు ఉన్నాయని పేర్కొన్నారు.

దోమల నివారణకు చర్యలు



పరికి చెరువులో ఆయిల్ బాల్స్ వేయిస్తున్న ఎంటమాలజీ సూపర్‌వైజర్ నరసింహులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు ఎంటమాలజీ సూపర్‌వైజర్ డి. నరసింహులు, సిబ్బందితో కలిసి దోమల నివారణకు పరికి చెరువులో గురువారం ఎంఎల్ఓ ఆయిల్ బాల్స్ వేశారు. అదేవిధంగా హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని చెరువులు, కుంటల్లో 15 రోజులకు ఒకసారి డ్రోన్ యంత్రం సాయంతో దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్నామని తెలిపారు.

అయ్యప్ప ఆలయంలో ఇరుముడి కార్యక్రమం



ఇరుముడి కార్యక్రమంలో సతీశ్ రావు

ఆల్విన్‌కాలనీ: బీఆర్ఎస్ నాయకుడు రాజు ఆహ్వానం మేరకు కూకట్‌పల్లి అయ్యప్ప స్వామి ఆలయంలో గురువారం ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి సతీశ్ రావు హాజరయ్యారు. కార్యక్రమంలో సాయిగౌడ్, వెంకటేశ్ నాయుడు, అక్షయ్, ధన్వీర్, ప్రవీణ్, నజీర్, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

సహకార బ్యాంకు ఏర్పాటు చేయాలని వినతి

దుండిగల్: దుండిగల్‌లో పీఏసీఎస్ సహకార బ్యాంకు ఏర్పాటు చేయాలని కోరుతూ దుండిగల్ గ్రామ ముఖ్య నాయకులు, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్, డీసీఓకు గురువారం వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. దీనికి వారు సానుకూలంగా స్పందించి బ్యాంకు ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దుండిగల్ గ్రామ ముఖ్య నాయకులు చినంగి వెంకటేశం ముదిరాజ్, అమరం గోపాల్ రెడ్డి, జక్కుల కృష్ణ యాదవ్, జక్కుల శ్రీనివాస్, డి.ఆనంద్, రవీందర్ యాదవ్, నల్బూరి కృష్ణ, మోరా అశోక్ ముదిరాజ్, బండారి మహేశ్, ఆకుల ప్రేమ్ పటేల్, ఈ. శ్రీనివాస్ గౌడ్, పాండు గౌడ్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం



చిత్రశ్రీ

సుభాష్‌నగర్: వివాహిత అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంలో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆనంద్‌నగర్ కాలనీకి చెందిన రెడ్డిబాబు, చిత్రశ్రీ (20) భార్యాభర్తలు. గత నెల 20న చిత్రశ్రీ ఇంట్లోవారికి చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. దీంతో భర్త చుట్టుపక్కల, స్నేహితులు, బంధువులు ఇళ్లలో వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో గురువారం సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిత్యం ఉత్తర ద్వార దర్శనమే..

- శ్రీ రంగనాయక స్వామి ఆలయ విశిష్టత
- 800 ఏళ్ల చరిత్ర గల టెంపుల్
- అద్దంలోనే భక్తులకు దర్శనం
- నేడు వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక కథనం..



విద్యుత్ కాంతులతో కూకట్‌పల్లిలోని శ్రీ రంగనాయక స్వామి ఆలయం

మూసాపేట: ఆ ఆలయంలో స్వామివారు నిత్యం ఉత్తర ద్వారా దర్శనంతోనే అద్దంలోనే భక్తులకు దర్శనం ఇస్తుంటారు. సుమారు 800 ఏళ్ల చరిత్ర గల ఆ టెంపుల్‌లో ఎన్నో విశిష్టతలు, అద్భుతాలు చోటు చేసుకున్నాయి. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆ ఆలయంపై ప్రత్యేక కథనం..

ఆలయ చరిత్ర..

కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు సమీపంలో సుమారు 800 ఏళ్ల క్రితం శ్రీ రంగనాయక స్వామివారు రాతి కొండలను చీల్చుకుంటూ గుహలో స్వయంభూగా వెలిశారు. ఒకప్పుడు మునులు, ఋషులు తపస్సు చేసుకునే వారు. గుహలోని స్వామివారిని చూసి పూజలు చేయడం ఆనవాయితీగా ప్రారంభించారు. సమీపంలోని చెరువు నీటిని తీసుకువచ్చి స్వామివారికి అభిషేకం చేసేవారు. దీంతో ఆ చెరువును కూడా శ్రీ రంగనాయక చెరువుగా పిలుస్తున్నారు. ఆ తర్వాత 2010 లో చిన్నజీయర్ స్వామి చేతుల మీదుగా పునఃప్రతిష్ఠ చేసి నిత్య పూజలు, వార్షిక బ్రహ్మోత్సవాలు, ధనుర్మాస ఉత్సవాలు వంటి పూజలు విశేషంగా నిర్వహిస్తున్నారు. ప్రతి శనివారం సుమారు 3 వేల మంది భక్తులకు అన్నదానం చేపడుతున్నారు.



స్వయంభూగా వెలిసిన స్వామివారు

అద్దంలోనే స్వామి దర్శనం..

స్వామివారు తూర్పు వైపు చూస్తుంటారు. అయితే ద్వారం ఉత్తరం వైపు ఉండడంతో స్వామివారిని నేరుగా చూడలేం. అద్దంలోనే దర్శించుకోవాల్సి వస్తుంది. మిగిలిన ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి రోజు మాత్రమే ఉత్తర ద్వార దర్శనం ఉండగా, ఇక్కడ మాత్రం ప్రతిరోజూ ఉత్తర ద్వార దర్శనమే లభిస్తున్నది.

నాగశేషుడి దహనం చేసిన ప్రాంతంలోనే నాగ, శివలింగం ప్రతిష్ఠ ..

సుమారు 60 ఏళ్ల కిందట ఆరు అడుగుల నాగశేషుడు స్వామివారిని చుట్టుకొని ఉండేదని భక్తులు తెలిపారు. భక్తులకు కూడా అలాగే దర్శనం ఇచ్చేది. కొన్నేళ్ల అనంతరం నాగశేషుడు చనిపోగా ఆలయ సమీపంలోనే దహనం చేసి అదే ప్రాంతంలో నాగ ప్రతిష్ఠ చేశారని భక్తులు పేర్కొన్నారు. అనంతరం శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. రంగనాయక స్వామిని దర్శించుకున్న అనంతరం నాగశేషుడు, శివలింగాన్ని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అంతేగాకుండా ఆలయానికి క్షేత్ర పాలకుడుగా ఆంజనేయ స్వామి కూడా ఉన్నారు.



నాగశేషుడిని దహనం చేసిన ప్రాంతంలోనే ప్రతిష్ఠించిన శివలింగం

వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు..

వైకుంఠ ఏకాదశి సందర్భంగా రంగనాయక ఆలయంలో శుక్రవారం ఉదయం 5 నుంచే భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించనున్నారు. శనివారం కుడారై మహోత్సవం, 13న సోమవారం ఉదయం 10 గంటలకు గోదా రంగనాయక స్వామి కల్యాణ మహోత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. అదే విధంగా భరత్‌నగర్ కాలనీలోని హరిహర క్షేత్రంలో మూసాపేటలోని శ్రీలక్ష్మీ నరసింహ ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించనున్నారు.

ఆర్ఆర్‌నగర్‌లో కార్పొరేటర్ పర్యటన



ఆర్ఆర్‌నగర్‌లో నీట మునిగే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహాయాదవ్

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఆర్ఆర్‌నగర్‌లో కార్పొరేటర్ ముద్దం నర్సింహాయాదవ్ అధికారులతో కలిసి గురువారం పర్యటించారు. జీహెచ్ఎంసీ ఏఈ ఆశా, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ కాలనీ ప్రజలతో కలిసి నీట మునిగే ప్రాంతాన్ని పరిశీలించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. వర్షపు నీటి ప్రవాహం దగ్గరే మ్యాన్‌హోల్స్ ఏర్పాటు చేసి డ్రైనేజీలకు మళ్లించాలనే మరో ప్రతిపాదన చేశారు. ఈ విషయమై తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, కరుణాకర్ రెడ్డి, చలపతి, చక్రధర్, మురళీధర్‌గౌడ్, రఘునాథ్, శ్రీనివాస్, మల్లేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మూసాపేట: కైత్లాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఈనెల 10న విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ భీమ లింగప్ప గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆంజనేయనగర్, జనతానగర్, ప్రధాన రహదారి, కేర్‌హుండ్ స్కూల్ ప్రాంతాలు, మున్సిపల్ కార్యాలయం, జనతానగర్‌లోని శ్రీ అయ్యప్ప ఆలయ ప్రాంతాలు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కైత్లాపూర్ ఫ్లైఓవర్, సఫ్దార్‌నగర్, రాజీవ్‌గాంధీ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

11 కేవీ హ్యుందయ్ ఫీడర్ పరిధిలో..

మోతీనగర్: 11 కేవీ హ్యుందయ్ ఫీడర్ పరిధిలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఏఈ రాకేష్ గౌడ్ తెలిపారు. టాటా మోటార్, స్వాగత్ హోటల్, గేమ్ పాయింట్, మెరిడియన్ స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

వైకుంఠ ఏకాదశికి రండి



ఎంపీ ఈటల రాజేందర్‌కు ఆహ్వానపత్రికను అందజేస్తున్న శ్రీనివాస్ యాదవ్ తదితరులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ వివేకానందనగర్‌లోని శ్రీ భూనీల సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 10న స్వామివారి ఉత్తర ద్వార దర్శనం, 13న గోదా రంగనాథ స్వామివార్ల కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. ఆయా కార్యక్రమాలకు హాజరు కావాలని కోరుతూ మేడ్చల్ జిల్లా సెక్రటరీ పులిగొల్ల శ్రీనివాస్ యాదవ్ ఎంపీ ఈటల రాజేందర్‌ను గురువారం ఆహ్వానించారు. ఆయన వెంట అల్లాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు విజయ కుమార్ పాల్గొన్నారు.

సంక్రాంతికి ప్రత్యేక బస్సులు



కూకట్‌పల్లి డిప్యూటీ ఆర్ఎం కవిత

మూసాపేట: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు కూకట్‌పల్లి ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం కవిత అన్నారు. గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. సుమారు 80 ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉన్నాయని ఈనెల 10 ఈ బస్సులకు రిజర్వేషన్లు అయ్యాయని తెలిపారు. బీహెచ్ఈఎల్, మియాపూర్, కేపీహెచ్‌బీ, ఎస్ఆర్‌నగర్, అమీర్‌పేట్‌లో పాయింట్లు ఉంటాయని, ఖమ్మం, విజయవాడ, సత్తుపల్లి, వరంగల్, రాజమండ్రి వంటి ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడుస్తాయని పేర్కొన్నారు. ఈ బస్సుల్లో మహాలక్ష్మి పథకం వర్తించదని చెప్పారు. బుకింగ్ లేని బస్సుల్లో మహాలక్ష్మి టిక్కెట్లు తెలంగాణ రాష్ట్ర సరిహద్దు వరకే వర్తిస్తాయని పేర్కొన్నారు. రద్దీని బట్టి 11 నుంచి మరిన్ని బస్సులు పెంచే అవకాశం ఉందని తెలిపారు.

కూకట్‌పల్లి డిపోలో జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు



పాల్గొన్న ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ వీరన్న, డిప్యూటీ ఆర్ఎం కవిత, డీఎం హరి, ఆర్టీసీ అధికారులు

మూసాపేట: కూకట్‌పల్లిలోని ఆర్టీసీ డిపోలో గురువారం జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ వీరన్న ముఖ్య అతిథిగా హాజరై డ్రైవర్లకు పలు సూచనలు, సలహాలు, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వందలాది మంది ప్రయాణికుల ప్రాణాలు డ్రైవర్‌పైనే ఆధారపడి ఉంటాయని మానసిక ఒత్తిడితో డ్యూటీకి వస్తే ఏదైనా ప్రమాదం జరిగే ప్రమాదం ఉంటుందన్నారు. ఏకాగ్రతతో బస్సు నడుపుతూ ట్రాఫిక్ రూల్స్ పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి ట్రాఫిక్ ఎస్‌హెచ్ఓ ముత్తు యాదవ్, కూకట్‌పల్లి డిప్యూటీ ఆర్ఎం కవిత, డిపో మేనేజర్ హరి, సీఐ శ్రీలత, ఎంఎఫ్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆల్విన్‌కాలనీ డివిజన్ బీజేపీ అధ్యక్షుడి నియామకం



నియామక పత్రం అందుకుంటున్న రమేశ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా ఎత్తరి రమేశ్‌ను డివిజన్ బీజేపీ క్రియాశీల సభ్యులను నియమిస్తూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి గురువారం నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. తన పదవికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, శేరిలింగంపల్లి బీజేపీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీందర్‌రావు, మాధవరం రంగారావు, డాక్టర్ కొరదాల నరేశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నరేందర్ రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రామరాజు, సెక్రటరీ స్రవంతి, మణిభూషణ్, నర్సింగ్‌కు ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా శక్తి కేంద్రం ఇన్‌చార్జిగా ఉండి సభ్యత్వ నమోదు, బూత్ కమిటీల ఏర్పాటుకు సహకారం అందించి ప్రోత్సహించిన బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వాహనదారులు రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలి



కుత్బుల్లాపూర్: వాహనదారులు రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి రఘునందన్‌గౌడ్ అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని మేడ్చల్ ఆర్‌టీఓ సిబ్బంది జాతీయ రహదారి 44, ఓఆర్ఆర్‌పై గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. భారీ, చిన్నతరహా ట్రాన్స్‌పోర్టు వాహనాలను ఆపి రిఫ్లెక్ట్ టేపు ఆవశ్యకతను తెలియజేశారు. కార్యక్రమంలో అధికారులు సాదుల శ్రీనివాస్, శిల్ప, సహాయ వాహన తనిఖీ అధికారి త్రివేణిబాయి, కానిస్టేబుళ్లు, హోంగార్డులు తదితరులు పాల్గొన్నారు.

గోదా రంగనాథ స్వామి కల్యాణానికి సారె సమర్పణ



మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ శ్రీ వివేకానందనగర్‌లోని దుర్గమ్మ, పోచమ్మ, నాగదేవత ఆలయాల తరఫున శ్రీ గోదా రంగనాథ స్వామి వారి కల్యాణానికి గురువారం సారెను సమర్పించారు. ఆలయ చైర్మన్ పులిగొల్ల శ్రీనివాస్ యాదవ్, గణేశుల నాగేశ్వరరావు, వీ వెంకన్న, మహిళా భక్తులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు కార్మికులకు గాయాలు

సుభాష్‌నగర్: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ఇద్దరు తాత్కాలిక కార్మికులు గాయపడ్డారు. గాజులరామారం చౌరస్తాలో రోడ్డు విస్తరణలో భాగంగా గురువారం విద్యుత్ పనులు చేపడుతున్నారు. సాయంత్రం 4 గంటల సమయంలో అకస్మాత్తుగా కరెంట్ సరఫరా కావడంతో స్తంభంపై వైర్లు లాగే ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. అనిల్ అనే కార్మికుడు స్తంభం నుంచి కింద పడగా, మహేశ్ గాయపడ్డాడు. వెంటనే వీరిని చికిత్స కోసం షాపూర్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఏఈ చైతన్య భార్గవ్‌ను 'సాక్షి' వివరణ కోరేందుకు యత్నించగా అందుబాటులోకి రాలేదు.

వసతి గృహాల్లోని సమస్యలు పరిష్కరించాలి



జేఎన్‌టీయూహెచ్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న ప్రొటెక్షన్ ఫోర్స్ నాయకులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్‌లోని వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలని స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం, జేఎన్‌టీయూహెచ్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో నాయకులు జేఎన్‌టీయూహెచ్ పాలనా భవనం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గెస్ట్ లెక్చరర్స్‌కు, కొంతమంది అనధికార వ్యక్తులకు రీసెర్చ్ స్కాలర్స్ క్వార్టర్ అడ్డాగా మారిందని, దీనిని బాలుర వసతి గృహంగా మార్చాలన్నారు. అనంతరం అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు రాహుల్ నాయక్, శివకృష్ణ, రోహిత్ కుమార్, అరవింద్ కుమార్, సిద్ధార్థ్, బ్రహ్మం గౌడ్, సాయికుమార్ రాథోడ్, విశ్వతేజ, కిరణ్, శ్రీనివాస్ సాగర్ పాల్గొన్నారు.

పార్కింగ్ సమస్యకు ప్రణాళిక ఖరారు



సీఐ సురేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న అధ్యక్షుడు, సభ్యులు

మోతీనగర్: మూసాపేట డివిజన్ అవంతినగర్ తోటకాలనీలో పార్కింగ్ సమస్యతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సంక్షేమ సంఘం వారు సమస్యను అధిగమించేందుకు ప్రణాళికను రూపొందించారు. రోడ్డుమధ్యలో కొంత ఫీల్ లైన్ ఉండేలా మార్కింగ్ చేయాలని నిర్ణయించారు. దీనిద్వారా ట్రాఫిక్ సమస్యను కొంతమేర తగ్గించుకోవచ్చని సభ్యులు పేర్కొన్నారు. శుక్రవారం రోడ్డుపై మార్కింగ్ వేయనుండడంతో పరిసర ప్రాంత ఇళ్ల మహిళలు రోడ్లపై ఎలాంటి నీరు, ముగ్గులు వంటివి వేయవద్దని కోరారు. ఈ విషయాన్ని ముందుగా జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులకు సమాచారం అందించగా బాలానగర్ ట్రాఫిక్ సీఐ అవంతినగర్ తోట ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు వినతిపత్రం అందజేశారు. మాజీ కౌన్సిలర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జి. వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఆర్. సత్యనారాయణ స్వామి ఉన్నారు.

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి



శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారు



ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాటు చేసిన బారికేడ్లు

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగనగర్‌లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం జరిగే వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవదాయ ధర్మాదాయ శాఖ ఆలయ కార్యనిర్వాహక అధికారి జీఏకే కృష్ణ తెలిపారు. ఉదయం 4.15 గంటలకు శ్రీవారి దర్శనం, ఉదయం 11.30 గంటలకు సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించనున్నారు. భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు, టెంట్లు, తాగునీటి వసతులు కల్పించారు. అదేవిధంగా అవంతినగర్ తోటలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం ఏర్పాట్లు చేశారు. ఉదయం 7 గంటలకే అభిషేకాలు, పూజలు ప్రారంభం అవుతాయని ఆలయ ప్రధాన కార్యదర్శి ఆర్ సత్యనారాయణ స్వామి తెలిపారు.

ఘనంగా దైవ సేవకుల ఆత్మీయ సమ్మేళనం



కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహాయాదవ్



పాటలు పాడుతున్న గొంగోళ్ల సునీల్ బృందం

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో దైవ సేవకుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. సమ్మేళనం అధ్యక్షుడు డాక్టర్ అందె సుధాకర్ ఆధ్వర్యంలో మల్లికార్జుననగర్ భాగ్యశ్రీ గార్డెన్‌లో దైవ ప్రార్థనలతో నిర్వహించారు. ముఖ్య అతిథిగా కార్పొరేటర్ ముద్దం నర్సింహాయాదవ్ హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాస్టర్స్, క్రిస్టియన్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో గొంగళ సునీల్ బృందం, రత్నరాజు, డి. సుధాకర్, పీటర్, అనిల్, యెజురా, ముక్కిడి దాస్, కవిత, సత్య ప్రకాశ్, ఆనంద్, జాన్ విక్టర్, బీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.